# ఆడపిల్ల తల్చుకుంటే అంతేమరి

పరధ్యానంగా కాలేజీ మేడమెట్ల మీంచి దిగుతూన్న రవణమూర్తి ఇంకో మెట్టుదిగితే ఆమెని ఢీకొనేవాడే! ఆమె కెవ్వున అరిచేదో, కేకలు పెట్టి పదిమందినీ పిలిచి అల్లరి చేసేదో, చెంప పగులగొట్టేదో, అసలు ఏం కేర్ చెయ్యకుండా వెళ్ళిపోయి ఉండేదో - ఏంజరిగి ఉండేదో!

ఇంతలో వెనకనుంచి ఎవరో 'హాయ్' అని పిలిచారు. దాంతో, కింద మెట్టుమీద కాలు వెయ్యబోయిన వాడల్లా ఆగి వెనక్కి తిరిగి చూశాడు రవణమూర్తి.

బొద్దుగా, విరిసిన ముద్దమందారం లాంటి అమ్మాయి! అసలే పెద్దదిగా ఉన్న నోటిని మరింత పెద్దది చేసి నవ్వుతూ చెయ్యి ఊపుతోంది.

పోకెట్ డిక్షనరీ లాంటి ఈ అమ్మాయి ఎవరు చెప్మా? తనని 'హాయ్' అని పిలిచి, చెయ్యి ఊపి నవ్వుతోంది. రవణమూర్తి తికమక పడి విస్తుపోయి వెంటనే తేరుకొని తడబడుతూ "నన్నా అండీ?" అన్నాడు.

వెనక నున్న లావు అమ్మాయి పగలబడి నవ్వింది.

మరికాస్త అయితే, కెవ్వున అరవడమో, చెంప పగలగొట్టడమో, ఏదో ఒకటి చెయ్యవలసిన అమ్మాయి ఉందే, ముందు మెట్టు మీద ఉన్న ఆ అమ్మాయి, ఆమె కూడా వీణ మీటినట్లు శ్రావ్యంగా నవ్వింది.

మేడమెట్ల మీద వీణా నిక్వణం ఏమిటా అని రవణమూర్తి ఉలిక్కిపడి ఇటు తిరిగి ముందుకి చూశాడు. ఎదురుగుండా పద్దెనిమి దేళ్ళ మెరుపుతీగ!

వెనక ఒక బలిసిన చిలుకా, ముందు, ఒక అందాల రాజహంసానూ.

నవ్వుతూ ఉన్న ఆరెండు స్త్రీ మూర్తుల మధ్యా ఈ మెట్టు మీద తనూ.

తన పరధ్యానానికే నవ్వుతున్నారో లేక "నన్నా అండీ!" అంటూ అడిగిన తన వెర్రితనానికే నవ్వుతున్నారో, మొత్తం మీద ఇద్దరు అమ్మాయిలూ నవ్వుతున్నారు తనని చూసి.

అంతటి మగవాడైన రవణమూర్తికీ, చటుక్కున సిగ్గేసింది. వెంటనే పౌరుషం వచ్చింది. ఆ పౌరుషం కోపంగా మారింది. కోపం వ్యంగ్యంగా నోటివెంట బయటపడింది.

“సారీ నన్నేమో అనుకున్నాను లెండి. అయితే మీ పేరు 'హాయ్!' అన్నమాట” అంటూ మెరుపుతీగ వైపు చురుకైన ఓ చూపును విసిరి, గబగబా మెట్లు దిగి వెళ్ళిపోయాడు రవణమూర్తి.

అతను విసిరిన చూపు సూటిగా వచ్చి గుండెలకి తగిలిందేమో, మెరుపు తీగలాంటి విశాలాక్షి, మెదలలేక కదలలేక, ఆ మట్టున మెట్టుమీద అలాగే నిలబడిపోయి రవణమూర్తి వెళ్ళిపోయిన దిక్కే చూస్తూ ఉండిపోయింది.

ఇంతలో పై మెట్ల మీంచి లావుపాటి లావణ్య,లిప్‌స్టిక్ నవ్వు నవ్వుతూ, భారంగా ఒక్కొక్క మెట్టే దిగి వచ్చి పలకరిస్తూ, “ పెళ్ళి పెళ్ళి అంటూ కాలేజీ మానేసినదానివి, మొత్తానికి మళ్ళీ తిరిగి వచ్చి డిగ్రీలో చేరావన్నమాట. ఈ పని అప్పుడే చేస్తే ఈపాటికి సెకండియర్ అయిపోయి ఉండును కదా! ఊ .. ఎప్పుడు చేరావు? నిన్నా? ..ఇవాళా?” అంది.

విశాలాక్షి కళ్ళు ఇటు తిప్పనే లేదు. అవి ఇంకా అటే చూస్తున్నాయి!

విశాలాక్షిని ఒక్క కుదుపు కుదిపి - “అలా ఉండిపోయావేమిటే? ఆ అబ్బాయి ఎవరనా? అబ్బో ఈ కాలేజీలో కెల్లా పెద్ద బుద్ధిమంతుడులే! పుస్తకాల పురుగనుకో! ఎవ్వరితోటీ మాట్లాడడు. ఆడపిల్లలంటే మరీ భయం. ఆమడ దూరంలో ఉంటాడు. రవణమూర్తి అనీ - ఓ బడుద్ధాయి!” అంది లావణ్య.

విశాలాక్షి ఉలిక్కిపడింది. “రవణమూర్తా?” అంది అప్రయత్నంగా.

“ఏం? అతను నీ కింతక్రితమే తెల్సా?’

“వీళ్ళనాన్నగారు..?” మాట మధ్యలో ఆగిపోయింది విశాలాక్షి.

“పెద్ద పారిశ్రామిక వేత్త! పాడి ఆవులాంటి ఓ పెద్ద ప్లాస్టిక్ ఇండస్ట్రీ ఉంది ఆయనకి ... పేరేమో...”

“సర్లే... పెళ్ళిళ్ళ మార్కెట్‌లో లక్షలు పలుకుతూన్న రవణమూర్తి అంటే ఇతనే అన్నమాట...”

“నీ తల పంకించడం చూస్తే ఇతని గురించి నీకు బాగా తెలిసి నట్లుందే!”

“తెలుసు... అయితే ఇన్నాళ్ళూ వినడమే. చూసింది మాత్రం ఇవాళే..” అంటూ పై పంటితో కింది పెదవి ఓమారు నొక్కి, వెంటనే ఆలోచన నుంచి తేరుకుని లావణ్య కేసి చూసింది, విశాలాక్షి. తర్వాత తేలిగ్గా నవ్వి, లావణ్య భుజం మీద చెయ్యి వేసి ఆ

కబురూ ఈ కబురూ చెప్తూ లేడీస్ వెయిటింగ్ రూమ్ వైపు అడుగు కదిపింది.

ఇది జరిగిన వారం రోజులదాకా రవణమూర్తికి విశాలాక్షి కనిపించలేదు. విశాలాక్షికి రవణమూర్తి దొరకలేదు.

ఓ రోజు సాయంత్రం చాలా క్లాసులు ఉండక, కాలేజీ స్టూడెంట్స్‌లో మూడు వంతులమంది ఇళ్ళకి వెళ్ళిపోయి, కేంపస్ అంతా దాదాపు నిర్మానుష్యంగా ఉంటే, ఆఖరి పీరియడ్‌లో లైబ్రరి ముందున్న లాన్‌లో కూర్చుని మేగ్‌జైన్ తిరగేస్తున్నాడు రవణమూర్తి. ఇదే మంచి అవకాశం అని గమనించి విశాలాక్షి,వెనక నుంచి వెళ్ళి "హాయ్!" అంటూ పలకరించింది రవణమూర్తిని.

అతను ఉలిక్కిపడి చూశాడు.

విశాలాక్షి చిరునవ్వు నవ్వింది.

రవణమూర్తి కంగారుపడ్డాడు. ఈ అమ్మాయేవిటి ఇంత చొరవగా వచ్చి పక్కని కూర్చుంటోంది? ఎవరేనా చూస్తే?

"ఎందుకండీ బెదురు బెదురుగా అటూఇటూ చూస్తారు? మనల్ని ఎవరూ చూట్టం లేదులెండి. ఒకవేళ చూసినా, కొంప మునిగిపోదు - అయినా మనం ఏం కాని పని చేస్తున్నాం అని?" అంది విశాలాక్షి అతనికి మరింత దగ్గరగా జరిగి విలాసంగా కూర్చుంటూ -

రవణమూర్తికి ముచ్చెమటలు పోశాయి. గుండె వేగంగా కొట్టుకుంటోంది. నోట మాట రావడంలేదు. ఆమెకేసి కన్నార్పకుండా చూస్తూ అలాగే ఉండిపోయాడు.

"ఆ రోజు మిమ్మల్ని చూసి నవ్వానని కోపం వచ్చిందా? ... అందుకు మీరు గట్టిగానే జవాబు చెప్పారుగా?... అయితే మీ పేరు "హాయా?" అని అడిగారు. ఇప్పుడు చూడండి నాకు అదే మారు పేరై కూర్చుంది. ఫ్రెండ్స్ అందరూ నన్నిప్పుడు ఆ పేరుతోనే పిలుస్తున్నారు మీ ధర్మమా అని. నా పేరు విశాలాక్షి పోయి హాయ్ అయింది." కాస్త దైన్యం, కొంచెం విషాదం, ఓ పాలు విచారం, మరో పాలు బాధా ఇవన్నీ రంగరించి కళ్ళల్లో కుమ్మరించి కన్నీళ్ళ తరవాయిగా చూసింది విశాలాక్షి.

ఆమె కృషి ఫలించింది. రవణమూర్తి గుండె కదిలింది.

"అయ్యో పాపం ... నావల్ల మీకు ..." ఆ పైన మాట్లాడలేకపోయాడు.

నాడి, నిదానం చూసి రోగికి మందిచ్చే వైద్యుడిలా 'ఇవాళ్టికి ఈ డోస్ చాలు' అనుకొంది విశాలాక్షి.

తర్వాత రెండు రోజులకి చిరునవ్వుతో అతన్ని పలకరించి "ఏవిటి బొత్తిగా

కనిపించడమే లేదు" అంటూ పరిచయం పెంచింది.

ఓ వారం పోయాక "సరదాగా అటు బీచ్ కేసి షైరు వెళ్దాం. రాకూడదూ?" అని అడిగింది.

సముద్రం ఒడ్డుని ఇసుకలో కూర్చుని, లేచేటప్పుడు అతని చెయ్యి ఆసరా చేసుకుని లేవడం. పక్క పక్కని కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నప్పుడు చెయ్యో, భుజమో అతనికి తగిలేలా చేసి, అతనిలో బయలుదేరే ప్రకంపనాల్ని పరిశీలించడం మొదలు పెట్టింది.

ఓ మారు సినీమా అంది. మరోమారు షాపింగ్ అంది. ఇలా రోజు రోజుకీ వైద్యాన్ని ముమ్మరం చేసి, చివరికి తన చేతిని అతని చేతిలోకి తీసుకొని "విశాలా! నిన్ను విడిచి నేను ఉండలేను. మనం పెళ్ళి చేసుకుందాం. ఏమంటావు?" అని అతను బేలగా తన కళ్ళల్లోకి చూసి ప్రాధేయపడే స్థితికి తీసు ువచ్చింది.

వైద్యం, అనుకున్నట్లు సత్ఫలితాన్నే ఇచ్చింది. ఇప్పుడే కేసు జాగ్రత్తగా హేండిల్ చెయ్యాలి.

"ఏం విశాలా! మనం పెళ్ళి చేసుకుందాం" అని అతని చేత రెండు మూడు పర్యాయాలు బ్రతిమాలించుకుని ఆ తర్వాత ఓ రోజున "మన పెళ్ళా?" అంటూ పకపకా నవ్వింది.

"ఎందు కలా నవ్వుతావు?" అని చిన్నబుచ్చుకొన్న రవణమూర్తిని సముదాయించి, అతని జుట్టులోకి వ్రేళ్ళు పోనిచ్చి లాలిస్తూ, "అది కాదు రవణమూర్తీ! మన పెళ్ళి ఎలా అవుతుంది చెప్పు? నువ్వా శ్రీమంతుల బిడ్డవి. నేనా మధ్య తరగతి అమ్మాయిని. మీ నాన్నకి కట్నం లక్షల్లోకావాలి. మావాళ్ళు వెయ్యి రూపాయలు కూడా ఇచ్చుకోలేరు. ఈ పరిస్థితిలో మన పెళ్ళి కావడం సాధ్యమేనా? నువ్వే ఆలోచించు" అంటూ రవణమూర్తి ఆలోచనకి పని కల్పించింది.

తర్వాత ఎన్ని రోజులు తల బద్దలు కొట్టుకున్నా అసాధ్యమైన ఆ పెళ్ళిని, సాధ్యం ఎలా చెయ్యాలో తోచలేదు రవణమూర్తికి.

"నేను రకరకాలుగా ఆలోచించాను. ఎన్ని విధాల ఆలోచించినా నాకు మార్గం బోధపడలేదు. నువ్వే ఏదో ఒక ఉపాయం చెప్పు. మొత్తంమీద మన పెళ్ళి జరిగి తీరాలి" అన్నాడు రవణమూర్తి.

రవణమూర్తి నిజాయితీ మీద బాగానమ్మకం కుదిరాక, 'ఇదీ ప్లాన్' అని చెప్పింది విశాలాక్షి.

ఇలా వాళ్ళిద్దరూ కూడబలుక్కున్న నెల్లాళ్ళకి, పెద్ద పారిశ్రామిక వేత్త, ప్లాస్టిక్ ఇండస్ట్రీ అధిపతి అయిన జగత్పతిరావుగారికి పోస్టులో ఓ పెద్ద ఉత్తరం, ఆ ఉత్తరంతో బాటు కార్డు సైజ్ ఫోటో వచ్చాయి.

ఓ అమ్మాయి మెడలో రవణమూర్తి తాళి కడుతూన్న ఫోటో అది!

జగత్పతిరావు నెత్తిమీద పిడుగు పడ్డట్టు ఉలిక్కిపడ్డాడు. తర్వాత స్థిమితంగా "ఎవరీ అమ్మాయి?" అని పరిశీలనగా చూసి నెత్తి మీద చేతులేసుకుని "కొంప ముంచావు కదురా?" అని ఒక్క అరుపు అరిచాడు.

"ఏం నాన్నా?" అన్నాడు రవణమూర్తి కంగారుగా అతన్ని సమీపిస్తూ.

"ఏం, ఏమిటి నీమొహం! పెళ్ళి చూపుల కని ఆరు నెలల క్రితం నేనూ, మీ అమ్మా వెళ్ళి చూసి వచ్చింది ఈ అమ్మాయినే. పిల్ల దీపంలా ఉంది. లక్ష రూపాయలిస్తాం అంటే చెప్పండి. మా అబ్బాయిని తీసుకువస్తాం. ఒకళ్ళ నొకళ్ళు చూసుకుంటారు. ముహూర్తం నిశ్చయం చెయ్యొచ్చు" అన్నాను. వాళ్ళు పాతిక వేలు కంటే ఇచ్చుకోలేం అన్నారు. మేం వచ్చేస్తూంటే ఈ అమ్మాయి వెనక్కి పిలిచి "ఇదిగో చూడండి. మీ అబ్బాయికి పాతిక వేలు కాదు గదా, పాతిక రూపాయలు కూడా కట్నం రాకుండా పెళ్ళికి ఒప్పుకోవలసి వస్తుంది" ఏ మనుకున్నారో, అంది.

"ఆహా ... అలాగా?" అన్నాను కోపంతో నేను ఊగిపోతూ.

"మీ అబ్బాయికి లక్ష కాదు కదా, ఒక వెయ్యి అయినా సరే కట్నం తీసుకుని పెళ్ళి చెయ్యగలిగితే నేను ఆజన్మాంతం బ్రహ్మచారిణిగా ఉండిపోతాను. నేను ఓడిపోతే ఇదీ షరతు. మరి మీరు ఓడిపోతే?" అంటూ నన్ను కవ్వించింది ఈ పిల్ల.

"ఒక వేళ అలాగే కట్నం దమ్మిడీ తీసుకోకుండా మావాడి పెళ్ళి జరిగితే, నీకు ఒక లక్ష రూపాయలకు చెక్కు రాసిస్తాను. సరేనా?" అన్నాను.

"ఏవి టీ పందేలూ, షరతులూనూ" అంటూ ఇటు మీ అమ్మ గొడవ చేసింది, అటు ఆ అమ్మాయి తల్లిదండ్రులు కేకలేశారు.

కాని చివరికి ఆ రోజు ఆ శపథాలు అలాగే ఖాయం చేసి ఇంటికి వచ్చాను. తర్వాత ఒకటి రెండు రోజులకు కోపం తగ్గి,నాలో నాకే నవ్వు వచ్చింది. ఏదో పిచ్చి పిల్ల. దాంతో నాకేవిటి పంతం? పోనిద్దూ అనుకొని ఆ సంగతే మరిచిపోయాను. మొత్తానికి జ్ఞాపకం పెట్టుకుని శపథం చెల్లించుకుందన్నమాట. అయినా ఒరేయ్ వాజమ్మా, ఇలా ఎందుకు చేశావురా? చెప్పకుండా ఇలా ఓ అమ్మాయి మెళ్ళో తాళి కట్టెయ్యడమే? మాట మాత్రంగా నాకు చెబితే..." అంటూ ఏం చెయ్యాలో పాలుపోక, బోనులో పెట్టిన సింహంలా మతి లేకుండా అటూ ఇటూ పచార్లు చెయ్యసాగాడు జగత్పతిరావు.

నాన్న చెప్పిందంతా వింటే, విశాలాక్షి తనని వెర్రివాడిని చేసి,బోల్తా కొట్టించింది అనే అనుమానం మనస్సులో మెదిలింది రవణమూర్తికి. కాని అంతా అయిపోయాక ఇప్పుడు ఏవిటి చేసేది? ఏవిటి చెయ్యడమా అని తలలు పట్టుకుని కూర్చున్న ఆ ఇద్దరు పురుష పుంగవుల దగ్గరికీ, నవ వధువు విశాలాక్షిని నడిపించుకొని వచ్చి, "ఏం చెయ్యడం ఏవిటి? వరకట్నం బదులు ఆ లక్ష రూపాయలూ కోడలికి కన్యాశుల్కం ఇచ్చుకోండి" అంటూ పగల బడి నవ్వింది రవణమూర్తి తల్లి. చేసే దేం లేక, మాట పట్టింపు ఉన్న జగత్పతి రావు, చెక్కు బుక్కు తీశాడు - ఆడపిల్ల తల్చుకుంటే అంతే మరి అనుకుంటూ.

*(1991 ఆంధ్ర ప్రభ)*